గాల్లో తేలి.. హాల్లో వాలి

ట్రాఫిక్ కారణంగా పారాగ్లైడింగ్ చేసి ఎగ్జామ్‌కు వెళ్లిన విద్యార్థి

సతారా, ఫిబ్రవరి 16: పరీక్ష రాసేందుకు వెళ్తున్న ఓ విద్యార్థికి ట్రాఫిక్ రూపంలో మరో పరీక్ష ఎదురైంది. దీంతో ఆ విద్యార్థి వినూత్నంగా ఆలోచించి సమస్యను అధిగమించాడు. మహారాష్ట్రలోని సతారా జిల్లాకు చెందిన విద్యార్థి ట్రాఫిక్ కారణంగా ఏకంగా పారాగ్లైడింగ్ చేసి, కాలేజీకి చేరుకున్నాడు. దీంతో సకాలంలో పరీక్షకు హాజరయ్యాడు. అతడి ప్రయాణాన్ని సామాజిక మాధ్యమాల్లో షేర్ చేయగా, నెటిజన్లు అవాక్కయ్యారు. మహారాష్ట్రలోని వాయి తాలుకా పసరాని గ్రామానికి చెందిన సమర్థ్ మహంగడే ఇటీవల ఈ సాహసాన్ని ప్రదర్శించాడు. పరీక్ష రాయడానికి కాలేజీకి బయలు దేరిన అతడికి వాయి-పంచగని రోడ్డులో భారీ ట్రాఫిక్ జామ్ కనిపించింది. వెంటనే దానికి బెంబేలెత్తిపోకుండా పారా గ్లైడింగ్ ద్వారా కాలేజీకి చేరుకోవాలని నిర్ణయించుకున్నాడు. వెంటనే సాహస క్రీడల నిపుణుడైన గోవింద్ యెవాలె సాయం కోరాడు. ఆయన అంగీకరించడంతో నిపుణుడి సాయంతో పారా గ్లైడింగ్ దుస్తులు వేసుకొని, కాలేజీ బ్యాగును భుజాన వేసుకొని రయ్ మంటూ ఆకాశంలో సాగిపోయి పరీక్ష కేంద్రం సమీపంలో వాలిపోయాడు.

ముక్కుతో టైపింగ్.. 21వసారి గిన్నిస్ రికార్డు

న్యూఢిల్లీ : ఢిల్లీకి చెందిన వినోద్ మొబైల్ కీబోర్డ్‌పై ముక్కుతో ఆంగ్ల వర్ణమాలను వేగంగా టైప్ చేసి గిన్నిస్ బుక్‌లో చోటు దక్కించుకున్నాడు. అంతేకాదు 21వసారి గిన్నిస్ రికార్డ్స్‌లో చోటు సంపాదించి.. క్రికెట్ దిగ్గజం సచిన్ టెండుల్కర్ పేరిట ఉన్న 19 రికార్డులను అధిగమించాడు. ఢిల్లీలోని కిరాడీకి చెందిన వినోద్ కుమార్ చౌదరిని అక్కడివారు టైపింగ్ మ్యాన్‌గా పిలుచుకుంటారు. ముక్కుతో మొబైల్ కీబోర్డ్‌పై 108 ఆంగ్ల అంక్షరాలను ఒక నిమిషం 18 సెకన్లలో టైప్ చేయగలిగాడు. కండ్లకు గంతలు కట్టుకొని, మౌత్ స్టిక్‌తో టైపింగ్‌లో వినోద్ రికార్డులు నెలకొల్పాడు.

గర్భంలో ఉండగానే క్యాన్సర్‌ను గుర్తించొచ్చు!

వాషింగ్టన్, ఫిబ్రవరి 16: బిడ్డ గర్భంలో ఉండగానే.. క్యాన్సర్ వ్యాధిని పసిగట్టవచ్చునని తాజా అధ్యయనం ఒకటి వెల్లడించింది. చాలామందిలో క్యాన్సర్ ఉందన్న సంగతి ఆలస్యంగా బయటపడుతుంది. దీంతో క్యాన్సర్ వ్యాధి ముదిరి, వైద్య చికిత్సకు లొంగని స్థాయికి చేరుకుంటుంది. దీనిపై మిషిగన్‌లోని 'వాన్ ఆండెల్ ఇన్‌స్టిట్యూట్' పరిశోధకులు పలు ప్రయోగాలు జరిపారు. వీరి అధ్యయనం ప్రకారం, క్యాన్సర్ ముప్పును బిడ్డ జన్మించక ముందే, గర్భంలో పిండం దశలో ఉండగానే గుర్తించవచ్చునని తేలింది. ఎలుకలపై ప్రయోగాల్లో ఈ విషయం వెల్లడైంది. దీనిపై మరింత లోతైన అధ్యయనం చేయాల్సిన అవసరముందని పరిశోధకులు తెలిపారు.

మహా నిర్లక్ష్యం!

- ఢిల్లీ తొక్కిసలాట ఘటనలో రైల్వే శాఖ తీరుపై విమర్శలు
- లెక్కకు మించి టికెట్ల విక్రయం, అనౌన్స్‌మెంట్‌లో గందరగోళం
- ప్లాట్‌ఫాం కిక్కిరిసినా భద్రతా సిబ్బంది ఏర్పాటులో వైఫల్యం
- రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ రాజీనామాకు విపక్షాల డిమాండ్
- 18కి చేరిన తొక్కిసలాట మృతులు.. పదుల మందికి గాయాలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లో శనివారం రాత్రి జరిగిన తొక్కిసలాటలో మృతిచెందిన వారి సంఖ్య 18కి చేరింది. వీరిలో 14 మంది మహిళలు, నలుగురు పిల్లలు ఉండగా.. 10 ఏండ్ల లోపు వారు ఇద్దరు ఉన్నారు. డజను మందికి పైగా ప్రయాణికులు గాయపడగా, వారికి లోక్‌నాయక్ జయ్‌ప్రకాశ్ హాస్పిటల్‌లో చికిత్స అందిస్తున్నారు. లెక్కకు మించి టికెట్ల విక్రయం, రైల్వే శాఖ అనౌన్స్‌మెంట్‌లో గందరగోళమే ఈ తొక్కిసలాటకు ప్రధాన కారణంగా కన్పిస్తున్నది. ఈ ప్రమాదంలో రైల్వే శాఖ నిర్లక్ష్యం స్పష్టంగా కన్పిస్తున్నది. ప్రయాగ్‌రాజ్ వెళ్లే రైళ్లను రెండూ ఒకే సమయంలో పెట్టడం, వేలాది మందితో ప్లాట్‌ఫాం కిక్కిరిసినా తగిన భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేయకపోవడం, ప్రమాదం జరిగిన మరునాడైన ఆదివారం కూడా స్టేషన్‌లో అవే పరిస్థితులు కన్పించడం ఆ శాఖ వైఫల్యాన్ని స్పష్టంగా ఎత్తిచూపుతున్నాయి.

శనివారం రాత్రి ఢిల్లీ రైల్వే స్టేషన్‌లో రైలెక్కేందుకు ఎగబడుతున్న ప్రజలు

రైళ్ల పేర్లు ఒకేలా ఉండటం వల్లే

ప్రయాగ్ రాజ్ ఎక్స్‌ప్రెస్, ప్రయాగ్‌రాజ్ స్పెషల్ రైళ్ల పేర్లు రెండూ ఒకేలా ఉండటమే ప్రమాదానికి కారణమని ప్రత్యక్ష సాక్షులు కొందరు తెలిపారు. శనివారం రాత్రి 9.45 గంటల ప్రాంతంలో ప్లాట్‌ఫారం 14పై ప్రయాగ్‌రాజ్ ఎక్స్‌ప్రెస్ ఉంది. అదే సమయంలో ప్రయాగ్‌రాజ్ స్పెషల్ రైలు 12వ నంబర్ ప్లాట్‌ఫాంపైకి వస్తున్నట్టు అనౌన్స్ చేశారు. అయితే అప్పటికే 14వ ప్లాట్‌ఫాంపై వేచి చూస్తున్న చాలామంది తాము ఎక్కాల్సింది అ రైలేమోనని భావించి గందరగోళానికి గురయ్యి 12వ నంబర్ పైకి వెళ్లడానికి ఓవర్ బ్రిడ్జి వైపు పరుగులు తీశారు. మరికొందరు జనరల్ టికెట్లు తీసుకున్న వారు సైతం అందులో సీటు దొరుకుతుందేమోనని పరుగులు పెట్టారు. ఈ సందర్భంగా ఏర్పడిన తొక్కిసలాట నుంచి తప్పించుకోవడానికి కొందరు సామాన్లు వదిలి బ్రిడ్జి రెయిలింగ్‌ను ఎక్కగా, చాలా మంది కింద పడ్డారు. వారిని తొక్కుకుంటూ మిగతా వారు పరుగులు తీయడంతో పలువురు మృతి చెందారు. ఉత్తర రైల్వే సీపీఆర్‌వో హిమాన్షు ఉపాధ్యాయ్ కథనం ప్రకారం ఫుట్‌ఓవర్ బ్రిడ్జి పై నుంచి 14,15 ప్లాట్‌ఫాంలపైకి వచ్చే కొందరు ప్రయాణికులు జారి మిగతా వారిపై పడటంతో ఏర్పడిన తొక్కిసలాటలో ఈ మరణాలు సంభవించాయని చెప్పారు.



గంటకు 1500 టికెట్లు

మరికొందరు ప్రయాణికుల కథనం ప్రకారం.. ఒక పక్క రైళ్లు సమయానికి బయలుదేరకపోవడం, మరో పక్క గంటకు 1500కు పైగా జనరల్ టికెట్లను అమ్మడంతో ప్లాట్‌ఫామ్‌లపై జనం పేరుకుపోయి తీవ్ర గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయని చెప్పారు. అలాగే ప్రయాగ్‌రాజ్ వెళ్లే ప్లాట్‌ఫాంల మార్పు పై తప్పుగా అనౌన్స్‌మెంట్ చేయడంతో ప్రయాణికులు తీవ్ర గందరగోళానికి గురయ్యారని, అది తొక్కిసలాటకు దారి తీసిందని తెలిపారు. ఈ ఘటనపై విచారణకు రైల్వే శాఖ ఇద్దరు సభ్యులతో ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది.

రూ.10 లక్షల పరిహారం

ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వం రూ.10 లక్షల నష్టపరిహారాన్ని ప్రకటించింది. అలాగే తీవ్రంగా గాయపడిన వారికి 2.5 లక్షలు, స్వల్పంగా గాయపడిన వారికి లక్ష రూపాయల వంతున పరిహారం ఇవ్వనున్నట్టు తెలిపింది.

ఆదివారమూ అదే సీన్

న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లో శనివారం జరిగిన తొక్కిసలాట తర్వాత అయినా ప్రభుత్వం పాఠం నేర్చుకున్నట్టు లేదు. ఆదివారం కూడా స్టేషన్‌లో అలాంటి నిర్లక్ష్య ఘటనలే చోటుచేసుకుంటున్నా అధికారులు ప్రేక్షక పాత్ర పోషించారు. పోలీసులు ఆ పరిసరాల్లోనే కన్పించలేదు. ఆదివారం ప్లాట్‌ఫాం 16పైకి వచ్చిన బీహార్ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ ఎక్కడానికి ప్రయాణికులు ఎగబడ్డారు. టికెట్లు లేని వారు, రిజర్వేషన్ లేని వారు రిజర్వ్‌డ్, ఏసీ బోగీల్లోకి దౌర్జన్యంగా చొరబడి సీట్లను ఆక్రమించుకున్నారు. రైలులోకి ఎక్కేందుకు తీవ్ర తోపులాటలు జరిగాయి. కొందరు ఎమర్జెన్సీ విండోల నుంచి తమ లగేజీని లోపలికి విసరడం కన్పించింది. ఒక వృద్ధురాలిని ఎమర్జెన్సీ కిటికీ లోంచి లోపలికి పంపడానికి ప్రయత్నించగా, ఆమె అందులో ఇరుక్కుపోయింది. ఘోర ప్రమాదం తర్వాత కూడా ప్రయాగ్‌రాజ్ వెళ్లే ప్రయాణికుల సంఖ్య ఆదివారం కూడా అధికంగానే కన్పించింది.

రైల్వే మంత్రి రాజీనామా చేయాలి

ఘటనకు బాధ్యత వహిస్తూ రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తన పదవికి రాజీనామా చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. ఒక వేళ ఆయన రాజీనామా చేయకపోతే ఢిల్లీ రైల్వేస్టేషన్ నిర్వహణా లోపానికి బాధ్యుడిని చేస్తూ పదవి నుంచి తొలగించాలని కాంగ్రెస్ అధికార ప్రతినిధి సుప్రియా శ్రీనేత్ కోరారు. వెల్లువలా వస్తున్న ప్రయాణికుల గురించి రైల్వేకు తెలుసని, అయినా ఆ శాఖ గంటకు 1500 టికెట్లను అమ్మిందని ఆమె ఆరోపించారు. చివరి నిమిషంలో ప్లాట్‌ఫాంల మార్పు గురించి రైల్వే శాఖ చేసిన ప్రకటన కారణంగానే ఈ తొక్కిసలాట చోటుచేసుకుందని ఆప్ రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్ ఆరోపించారు.మృతుల సంఖ్యను ప్రభుత్వం దాచిపెడుతున్నదని ఆయన ఆరోపించారు. మృతుల కుటుంబాలకు తగిన పరిహారం అందజేయాలని ఆయన డిమాండ్ చేశారు.

రోజుకో ప్రమాదం.. అడుగడుగునా నిర్లక్ష్యం

మహా కుంభమేళా లాంటి ఒక మహా ఉత్సవం జరుగుతున్నప్పుడు ప్రభుత్వం పూర్తి అప్రమత్తతతో వ్యవహరించాలి. అడుగడుగునా జాగ్రత్తలు తీసుకుంటూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు, ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలి. కానీ ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాలో తరచూ ప్రమాదాలు జరుగుతుండటం నిర్వహణా లోపాల్ని ఎత్తిచూపుతున్నది. నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా అధికార బీజేపీ దిద్దుబాటు చర్యలు చేపడుతున్న దాఖలాలు కన్పించడం లేదు. ముఖ్యంగా ట్రాఫిక్ నిర్వహణ, జనసమూహ నిర్వహణలో ఈ వైఫల్యం స్పష్టంగా కన్పిస్తున్నది. ఇప్పటివరకు కుంభమేళాలో మూడు తొక్కిసలాట ఘటనలు చోటుచేసుకున్నాయి. జనవరి 29న కుంభమేళాలో అమృత స్నానం సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో 30 మంది మరణించగా, 60 మందికి పైగా గాయపడ్డారు. సంగమ్ నోస్ వద్ద జరిగిన తొక్కిసలాటలో ఒక చిన్నారి సహా ఏడుగురు మరణించారని ఇండియా టుడే వెల్లడించింది. ఇక కుంభమేళాలో ఏర్పాటు చేసిన టెంట్లలో ఐదారుసార్లు అగ్నిప్రమాదాలు చోటుచేసుకున్నాయి. కుంభమేళాకు వచ్చే దారుల్లో 300 కి.మీ వరకు ట్రాఫిక్ జామ్ అవుతున్నదంటే ఏర్పాట్లు ఎంత అస్తవ్యస్తంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. అలాగే ప్రయాణికుల తాకిడికి తాళలేక ప్రయాగ్‌రాజ్ రైల్వే స్టేషన్ తాత్కాలికంగా మూసివేత, నో ట్రాఫిక్ జోన్‌గా ప్రకటించడం, రోడ్డు మార్గంలో వచ్చే ప్రయాణికులు వాహనాలు దిగి సుమారు 30, 40 కి.మీలు కాలినడకన ప్రయాగ్‌రాజ్‌కు చేరుకోవాల్సిన దుస్థితి ఏర్పడటం.. బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలను తేటతెల్లం చేస్తున్నాయి.

తీవ్ర బాధాకరం: కేటీఆర్

హైదరాబాద్, ఫిబ్రవరి 16: న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లో శనివారం రాత్రి జరిగిన తొక్కిసలాట ఘటనపై బీఆర్ఎస్ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటనను గుండె ముక్కలయ్యే విషాదంగా పేర్కొన్న ఆయన.. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. తొక్కిసలాట ఘటన తనను తీవ్రంగా బాధించిందన్నారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రమాదంపై మాజీ మంత్రి హరీశ్ రావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇది ఎవరూ ఊహించలేని విషాదమని,పిల్లలతోసహా 18 మంది ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని ఆయన పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకురాలు, ఎంఎల్‌సీ కే కవిత కూడా సంతాపం ప్రకటించారు. ఆప్తులను కోల్పోయిన బాధిత కుటుంబాలకు సానుభూతి తెలిపారు. ఘటనపై మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ విచారం వ్యక్తం చేశారు.

మహా కుంభ మేళా పొడిగింపు?

మహా కుంభ్ నగర్: యూపీలోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాను ఈ నెల 28 వరకు పొడిగించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ముందుగా నిర్ణయించిన ప్రకారం ఈ మేళా ఈ నెల 26తో ముగియాల్సి ఉంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, ఈ మేళాలో విధులను నిర్వహిస్తున్న పోలీసులు, అధికారుల విధులను మరో రెండు రోజులపాటు పొడిగించినట్లు తెలుస్తున్నది. దీనిని బట్టి మేళాను మరో రెండు రోజులు పొడిగిస్తారని భావిస్తున్నారు. ప్రపంచంలో 50 కోట్ల మందికిపైగా పాల్గొన్న మొదటి కార్యక్రమంగా కుంభమేళా రికార్డు సృష్టించింది.

ఇక మాటలతోనూ గూగుల్ పే చేయొచ్చు!

ఏఐ సాయంతో సాకారం

న్యూఢిల్లీ: ఇక లక్షలాది గూగుల్ పే యూజర్లు ఏఐ ఫీచర్ ద్వారా మాటలతోనే యూపీఐ చెల్లింపులు చెయ్యొచ్చు. తమ యాప్ ద్వారా జరిగే డిజిటల్ చెల్లింపులను ఈ కొత్త వాయిస్ ఫీచర్ సులభతరం చేయనుందని గూగుల్ పే లీడ్ ప్రొడక్ట్ మేనేజర్(ఇండియా) శరత్ వెల్లడించారు. ఈ ఆవిష్కరణ యూపీఐ చెల్లింపుల్లో గేమ్ చేంజర్ కాగలదని భావిస్తున్నారు. వాయిస్ ఫీచర్ అందుబాటులోకి వస్తే నిరక్షరాస్యులు సైతం ఆన్‌లైన్ చెల్లింపులు చేయడం సాధ్యమవుతుంది. కేవలం మాటలతో ఇచ్చే ఆదేశాల ఆధారంగా ఈ కొత్త ఫీచర్ పని చేయనున్నట్టు సమాచారం.

'సీనియర్ల చీవాట్లు క్రిమినల్ నేరం కాదు'

న్యూఢిల్లీ: పని ప్రదేశంలో సీనియర్లు జూనియర్లకు చీవాట్లు పెట్టడాన్ని 'ఉద్దేశపూర్వక అవమానం'గా పరిగణించలేమని.. అందుకు క్రిమినల్ చర్యలు అవసరం లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అలాంటి సందర్భాల్లో క్రిమినల్ అభియోగాలకు అనుమతిస్తే వినాశకర పరిణామాలకు దారి తీయొచ్చని, ఆఫీసులో అవసరమైన క్రమశిక్షణ వాతావరణాన్ని దెబ్బ తీస్తుందని కోర్ట్ పేర్కొంది. మేధో వైకల్య వ్యక్తుల సాధికారత కోసం పనిచేసే జాతీయ సంస్థ డైరెక్టర్ 2022లో ఒక సహాయ ఆచార్యుడిని అవమానించారని దాఖలైన కేసును విచారించిన సందర్భంగా ధర్మాసనం ఈ తీర్పును ఇచ్చింది. డైరెక్టర్‌పై ఉన్న తాధికారులకు ఫిర్యాదు చేసినందుకు ఇతర ఉద్యోగుల ముందు ఆయన తనను దూషించి, మందలించారని ఫిర్యాదీదారు పేర్కొన్నారు. అయితే దాన్ని రెచ్చగొట్టే ఉద్దేశంతో చేసిన అవమానంగా పేర్కొనలేమని కోర్టు తెలిపింది.

ప్రసూతి సెలవులో ఉన్న ఉద్యోగినిని తొలగించరాదు

పంజాబ్, హర్యానా హైకోర్టు

చండీగఢ్: ప్రసూతి సెలవులో ఉన్న ఉద్యోగినిని తొలగించరాదని పంజాబ్, హర్యానా హైకోర్టు తీర్పు చెప్పింది. ప్రసూతి సెలవును మంజూరు చేసిన తర్వాత, ఉద్యోగం నుంచి తొలగించడం కోసం ఆ సెలవును కుదించకూడదని తెలిపింది. జీతం బాకీలను బాధితురాలికి చెల్లించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆమెను ఉద్యోగం నుంచి తొలగిస్తూ ఇచ్చిన ఉత్తర్వులు ఆమెకు మంజూరైన సెలవు దినాలు పూర్తయిన తర్వాత మాత్రమే అమల్లోకి వస్తాయని స్పష్టం చేసింది. సెలవు కాలంలో పూర్తి జీతాన్ని పొందే హక్కు ఆమెకు ఉన్నట్లు తెలిపింది. పెండింగ్ శాలరీని 8 వారాల్లోగా ఆమెకు చెల్లించాలని ఆదేశించింది.

నేడు ఢిల్లీ సీఎం ఎన్నిక

రేఖా గుప్తా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: ఢిల్లీ నూతన ముఖ్యమంత్రి ఎవరన్న ఉత్కంఠకు సోమవారం తెరపడనుంది. బీజేపీ శాసనసభాపక్ష సమావేశం సోమవారం నిర్వహించనున్నట్టు సమాచారం. ఇందుకోసం ఇద్దరు పరిశీలకులను కూడా పార్టీ ఎంపికచేసినట్టు తెలిసింది. వీరిచ్చే నివేదిక ఆధారంగా ప్రధాని మోదీ నాయకత్వంలో జరిగే బీజేపీ పార్లమెంటరీ బోర్డ్ సమావేశంలో సీఎం అభ్యర్థి పేరు ఖరారు అవుతుందని తెలిసింది. మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌పై గెలుపొందిన పర్వేశ్ వర్మ సీఎం రేసులో ముందంజలో ఉన్నారు. ఢిల్లీ మేయర్‌గా పనిచేసిన రేఖా గుప్తా పేరు కూడా పార్టీ వర్గాల్లో ఎక్కువగా వినపడుతున్నది. ప్రస్తుత బీజేపీలో ఎవ్వరూ మహిళా సీఎం లేకపోవటం ఆమెకు కలిసివచ్చే అంశమని చెబుతున్నారు. అలాగే..మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లో మాదిరి..పాపులారిటీ పెద్దగా లేని ఎమ్మెల్యేని బీజేపీ అధిష్ఠానం ఎంపిక చేయవచ్చునని భావిస్తున్నారు. ఫిబ్రవరి 19 లేదా 20న ఢిల్లీ సర్కార్ ప్రమాణ స్వీకారం ఉంటుందని సమాచారం.

పేరు మార్చుకోవడం ప్రాథమిక హక్కు

అలహాబాద్ హైకోర్టు కీలక తీర్పు

అలహాబాద్: పేరు ఎంపిక చేసుకోవడం లేదా మార్చుకోవడం భారత రాజ్యాంగం ప్రకారం ప్రాథమిక హక్కని అలహాబాద్ హైకోర్టు కీలక తీర్పును వెలువరించింది. సమీర్ రావు అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు ఈ తీర్పు చెప్పింది. తన స్కూలు సర్టిఫికెట్స్‌లో తన పేరును షానవాజ్ నుంచి మొహమ్మద్ సమీర్ రావుగా మార్చాలని కోరుతూ ఆ వ్యక్తి పిటిషన్ దాఖలు చేశారు. తన అభ్యర్థనను తిరస్కరించడం ప్రాథమిక హక్కుల ఉల్లంఘన కిందకు వస్తుందని పిటిషనర్ వాదించాడు. పేరు మార్చుకునే హక్కు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులలో ఒకటని శనివారం వెలువరించిన తీర్పులో కోర్టు పేర్కొంది. రాజ్యాంగంలోని 19(1)(ఎ) అధికరణ కింద వాక్ స్వాతంత్ర్యం, 21వ అధికరణ కింద వ్యక్తిగత స్వేచ్ఛ, 14వ అధికరణ కింద సమానత్వ హక్కు వంటివి ఇందులో ఉన్నాయని కోర్టు తెలిపింది. వ్యక్తి పేరు ఆ వ్యక్తి గుర్తింపులో కీలక భాగమని, పేరు మార్పు వ్యక్తిగత స్వేచ్ఛలో అంతర్భాగమని కోర్టు పేర్కొంది. స్కూలు రికార్డుల్లో తన పేరును మార్చడానికి ఉత్తరప్రదేశ్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ నిరాకరించడంతో సమీర్ రావు హైకోర్టును ఆశ్రయించారు. సర్టిఫికెట్ జారీ అయిన మూడేళ్లలో పల పేరు మార్పునకు అనుమతిస్తామని పేర్కొంటూ బోర్డు ఓ నిబంధనను ఉటంకించింది. అయితే ఈ నిబంధనను కోర్టు తోసిపుచ్చింది. ఇది ఏకపక్షంగా ఉందని, రాజ్యాంగం నిర్దేశించిన నిష్పాక్షికత, న్యాయం, సమానత్వం సూత్రాలకు భిన్నంగా ఉందని కోర్టు అభిప్రాయపడింది.

భారత ఎన్నికల్లో అమెరికా జోక్యం!

- దేశంలో ఓటింగ్ పెంచేందుకు 21 మిలియన్ డాలర్ల అమెరికా నిధులు
- వాటిని నిలిపివేస్తున్నట్టు డోజ్ విభాగం ప్రకటన
- దేశ ఎన్నికల్లో బయటి శక్తులు జోక్యం చేసుకోవడమేనన్న బీజేపీ

వాషింగ్టన్, ఫిబ్రవరి 16: మన దేశ ఎన్నికల ప్రక్రియలో అమెరికా జోక్యం చేసుకునేందుకు యత్నించిందా? దేశంలో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు మునుపటి బైడెన్ సర్కారు 21 మిలియన్ డాలర్లు కేటాయించడం, తాజాగా ట్రంప్ సర్కారు వాటిని నిలిపివేయడం చర్చనీయాంశంగా మారింది. భారత్‌లో ఓటర్ల సంఖ్యను పెంచడానికి అమెరికా ప్రభుత్వం అందజేసే 21 మిలియన్ డాలర్లను ఇక నుంచి నిలిపివేస్తున్నట్టు ట్రంప్ యంత్రాంగంలో కీలక పాత్ర పోషిస్తున్న మస్క్ నేతృత్వంలోని డోజ్ విభాగం ప్రకటించింది. 'అమెరికా పన్ను చెల్లింపుదారులు చెల్లించే ప్రతి డాలర్ సొంతానికి మాత్రమే కేటాయిస్తాం. మిగిలినవన్నీ రద్దు చేస్తున్నాం' అని ప్రకటించింది.

ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకోవడమే

అమెరికా నిధులపై బీజేపీ ప్రతినిధి అమిత్ మాలవీయ స్పందించారు. ఇది కచ్చితంగా భారతదేశ ఎన్నికల ప్రక్రియలో బయటి శక్తులు జోక్యం చేసుకోవడమేనని అన్నారు. 'ఈ నిధుల వల్ల ఎవరికి ప్రయోజనం జరిగింది? కచ్చితంగా అధికార బీజేపీకి అయితే కాదు' అని ఆయన స్పష్టం చేశారు. గత యూపీఏ ప్రభుత్వం దేశ ప్రయోజనానికి భంగం కలిగించే వ్యతిరేక శక్తులు భారత సంస్థలలోకి చొరబడటానికి వీలు కల్పించిందని ఆయన ఆరోపించారు. మన ఎన్నికల ప్రక్రియపై అమెరికా కేంద్రంగా ఉండే బిలియనీర్, కాంగ్రెస్, గాంధీల కుటుంబ సన్నిహితుడు జార్జి సోరోస్ నీడ అలుముకోవడాన్ని ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. భారతదేశ ఎన్నికల కమిషనర్ నియామక ప్రక్రియ పారదర్శకంగా, అందరినీ కలుపుకుని సాగిందని, అప్పట్లో భారత ఎన్నికల ప్రక్రియ విదేశీ ఆపరేటర్లకు అప్పగించారనడంలో ఎలాంటి సందేహం లేదని ఆయన ఆరోపించారు. అయితే దీనిని కాంగ్రెస్ వర్గాలు ఖండించాయి. తన వైఫల్యాలను దాచుకోవడానికి ఇలాంటి ఆరోపణలు చేస్తున్నదని పేర్కొన్నాయి.

భూమిపై అత్యంత తెలివైన ఏఐ!

నేడు గ్రోక్3ని విడుదల చేయనున్న మస్క్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: తమ కృత్రిమ మేధ చాట్‌బాట్ తాజా వర్షన్ గ్రోక్ 3ని సోమవారం రాత్రి 8 గంటలకు విడుదల చేయనున్నట్టు ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ ప్రకటించారు. దాంతో పాటు దాని లైవ్ డెమోను ఆవిష్కరించనున్నట్టు ఎక్స్‌లో వెల్లడించారు. 'భూమ్మీద అత్యంత తెలివైన ఏఐ'గా గ్రోక్ 3ని మస్క్ అభివర్ణించారు. గ్రోక్ 3 మాడల్ సింథటిక్ డాటాపై శిక్షణ పొంది ఉంటుందని.. ఇది తార్కిక స్థిరత్వాన్ని సాధించడానికి వెనక్కు వెళ్లి తాను చేసిన తప్పులను సమీక్షించుకొనే సామర్థ్యాన్ని కలిగి ఉంటుందని మస్క్ వెల్లడించారు.

నీతా అంబానీకి అరుదైన గౌరవం

న్యూఢిల్లీ: రిలయన్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు, చైర్‌పర్సన్ నీతా అంబానీకి అరుదైన గౌరవం దక్కింది. ఆమె దార్శనిక నాయకత్వానికి, దాతృత్వ సేవలకు గుర్తింపుగా మసాచుసెట్స్ గవర్నర్ మైరా హీలీ నుంచి విశిష్ట ప్రశంసా పత్రాన్ని నీతా అంబానీ అందుకున్నారు. భారత్‌తోపాటు ప్రపంచవ్యాప్తంగా విద్య, ఆరోగ్యం, క్రీడలు, కళలు, సంస్కృతి, మహిళా సాధికారత తదితర రంగాలలో నీతా అంబానీ చేస్తున్న సేవలను ప్రశంసా పత్రంలో పేర్కొన్నట్టు ఎక్స్ వేదికగా రిలయన్స్ ఫౌండేషన్ తెలిపింది. దార్శనిక నేత, కరుణామయి, వితరణశీలి, వరల్డ్ చేంజ్‌మేకర్‌గా నీతా అంబానీని గుర్తిస్తూ ప్రతిష్ఠాత్మక గవర్నర్ ప్రశంసా పత్రాన్ని మసాచుసెట్స్ గవర్నర్ మౌరా హీలీ అందచేసినట్టు ఫౌండేషన్ పేర్కొంది.

మరో 6 దేశాల్లోని భారతీయులకు వీసా-ఆన్-అరైవల్

అబుదాబి: యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) వీసా-ఆన్-అరైవల్ పథకాన్ని విస్తరించింది. ఇప్పటివరకు అమెరికా, బ్రిటన్, యూరోపియన్ యూనియన్ సభ్య దేశాల్లోని భారతీయులు తమ వద్ద చెల్లుబాటయ్యే వీసాలు, రెసిడెన్స్ పర్మిట్స్ లేదా గ్రీన్ కార్డ్స్ ఉంటే, ఈ సదుపాయాన్ని వినియోగించుకునేవారు. తాజా నిర్ణయం ప్రకారం, ఈ దేశాల జాబితాలో కొత్తగా మరో 6 దేశాలను యూఏఈ చేర్చింది. అవి.. సింగపూర్, జపాన్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, కెనడా. యూఏఈకి చేరుకున్న తేదీ నుంచి కనీసం ఆరు నెలలు చెల్లుబాటయ్యే ఆర్డినరీ పాస్‌పోర్టు గలవారు ఈ పథకాన్ని వినియోగించుకోవచ్చు. యూఏఈ ఇమ్మిగ్రేషన్ చెక్‌పాయింట్ వద్ద వీసా ఫీజును చెల్లించవలసి ఉంటుంది. 4 రోజుల వీసాకు దాదాపు రూ.2,270; 14 రోజులకు పొడిగింపునకు సుమారు రూ.5,670; 60 రోజుల వీసాకు సుమారు రూ.5,670 చెల్లించవలసి ఉంటుంది.

నరకం తలుపులు తెరుస్తా

హమాస్‌కు నెతన్యాహూ హెచ్చరిక

జెరూసలెం : ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహూ ఆదివారం హమాస్ ఉగ్రవాద సంస్థకు గట్టి హెచ్చరిక పంపించారు. బందీలందరినీ విడుదల చేయకపోతే గాజాలో నరకానికి తలుపులు తెరుస్తానని చెప్పారు. శనివారం మరో ముగ్గురు బందీల విడుదలకు సాయపడిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. తాము ట్రంప్ అడ్మినిస్ట్రేషన్‌తో సంపూర్ణ సమన్వయ, సహకారాలతో పని చేస్తున్నామన్నార